www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 6 జనవరి 2023

రేపు 'టేప్ ఎక్స్ పో 2023' ప్రారంభం: ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ది అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ అండ్ ఇంజనీర్స్ (టేప్) ఆధ్వర్యంలో గహ నిర్మాణానికి కావలసిన వస్తు వినియోగాలపై 'ఎక్స్ పో 2023' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టేప్ చైర్మన్ వెంకటేష్ బాబు, ప్రెసిడెంట్ ఎం. ప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు సంబంధించిన మెటీరియల్, టెక్నాలజీ, మిషనరీస్, ఎక్విప్మెంట్ పరికరాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను నగర పరిధిలోని పిఎల్ఆర్ కన్వెన్షన్ హాల్ లో శనివారం తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి ప్రారంభిస్తారన్నారు. ఎక్స్ పో నడిచే ప్రతి గంటకూ డ్రా తీసి బహుమతులు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టేప్ సెక్రటరీ బి. షణ్ముగం ఆర్గనైజేషన్ సెక్రటరీ శివప్రసాద్, కన్వీనర్ సుధాకర్ రెడ్డి, నాగేశ్వరరావు, నరేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పనిచేయాలి

కుప్పంలో చంద్రబాబు పాదయాత్ర / తెలుగు తమ్ముళ్లకు దిశానిర్దేశం

కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు

ప్రజాశక్తి - గుడిపల్లి (చిత్తూరు జిల్లా)

కుప్పం నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మూడు రోజుల పర్యటనలో భాగంగా శాంతిపురంలో బుధవారం జరిగిన లాఠీఛార్జిని నిరసిస్తూ గురువారం పాదయాత్ర చేపట్టారు. ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్ నుంచి ఎంఎం మహల్ వరకు నిరసన పాదయాత్ర జరిగింది. పెద్దసంఖ్యలో తెలుగు తమ్ముళ్లు ఆయన వెంట నడిచారు. తుగ్లక్ పాలనకు చరమగీతం పాడాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఎపుడో బ్రిటీష్ పరిపాలనలో ఉన్నటువంటి చట్టాన్ని తీసుకొచ్చి రోడ్డుషోలు, బహిరంగసభలు నిర్వహించకూడదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తన నియోజకవర్గంలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకునే హక్కు ఎంఎల్ఎగా తనకు లేదా? అని ప్రశ్నించారు. వైఎస్ఆర్‌సిపి నాయకులు ఎన్ని కుప్పిగంతలు వేసినా కుప్పం నియోజకవర్గంలో గెలవలేరని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా తాను ఉన్నానని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన నాయకుడిగా ప్రజల మధ్య తిరిగే అర్హత తనకు మాత్రమే ఉందన్నారు.బుధవారం జరిగిన ఘటనపై 14 మందిపై కేసులు నమోదు చేయడం గమనార్హం.

కార్యకర్తలకు దిశానిర్దేశం

గుడిపల్లి మండలంలోని యూనిట్, సెక్షన్ ఇన్‌ఛార్జిల సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిశానిర్దేశం చేశారు. ఎంఎం మహల్ ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ రాబోయే కాలం ఎలక్షన్ కాలమని, జనం మధ్యలో ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు లేవనెత్తుతూ వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ దుర్మార్గ పాలనను ప్రజలకు తెలియజేయాలన్నారు. వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేస్తూ చైతన్యవంతులను చేయాలన్నారు. తుగ్లక్ పాలన పోవాలంటే ప్రతి కార్యకర్తా గ్రామాల్లో పనిచేయాలని, ప్రజల మధ్యలో ఉంటూ ప్రజలకు సందేశం ఇవ్వాలన్నారు. నాయకులకు, కార్యకర్తలకు వ్యక్తిగత గొడవలను ప్రజల మధ్యలో రుద్దకూడదని, అలాంటి నాయకులు, కార్యకర్తల లిస్టు తన వద్ద ఉందన్నారు. అలాంటి వ్యక్తులకు తగిన గుణపాఠం చెబుతానని హెచ్చరించారు. కష్టపడి పనిచేసే వ్యక్తులకు టిడిపిలో ప్రాధాన్యత ఉంటుందని, ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. ఎవరు ఎలా పనిచేస్తున్నారో నిత్యం తనకు సమాచారం అందుతుందని, ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

అక్రమ కేసులపై మండిపాటు

కుప్పం లాఠీఛార్జిలో గాయపడి చికిత్స పొందుతున్న కార్యకర్తలను చంద్రబాబునాయుడు గురువారం పరామర్శించారు. అనంతరం మీడియాతో చంద్రబాబు మాట్లాడుతూ 'కుప్పం ఏమన్నా పాకిస్థాన్‌లో ఉందా? ఇదేమన్నా పాకిస్థానా? రాష్ట్రంలో ఉన్న పోలీసులంతా కుప్పం వచ్చారు.. దాదాపు 1500 మంది కార్యకర్తలపై దాడి చేయడమే కాకుండా మాపై అక్రమంగా హత్యాయత్నం కేసులుపెట్టారు' అని మండిపడ్డారు. ప్రశాంతంగా ఉన్న కుప్పం నియోజకవర్గంలో అలజడులు సృష్టిస్తున్నారన్నారు. కార్యకర్తలపై నాలుగు కేసులు పెట్టారని, తామూ పోలీసులపై రివర్స్ కేసులు పెడతామన్నారు. అధికారులతో జగన్మోహన్‌రెడ్డి నేరాలు చేయిస్తున్నాడని, ఖచ్చితంగా జైలుకు పోవడం ఖాయమని హెచ్చరించారు. కందుకూరు ఘటనలో పోలీసుల వైఫల్యం ఉందన్నారు. కుప్పంలో గ్రానైట్ వ్యాపారులకు పెద్దిరెడ్డి నోటీసులు ఇచ్చి బెదిరించారన్నారు. పెద్దిరెడ్డి వందల కోట్లు దోచుకుంటూ పోతుంటే తాము సైలెంట్‌గా ఉండాలా అని ప్రశ్నించారు. పుంగనూరులోని శివశక్తి డెయిరీ లీటర్ పాలకు తక్కువ ఇస్తుందని, ప్రశ్నించిన తరువాతనే పాల ధర పెంచారన్నారు. జగన్‌కంటే బ్రిటీష్ వాళ్లు చాలా బెటర్ అన్నారు.

మానవ సేవే మాధవ సేవ : గవర్నర్

బాలాజీ మెడికల్ కాలేజీ, ఆస్పత్రి రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో/ తిరుపతి సిటి

'మానవసేవే మాధవసేవ' న్న స్ఫూర్తితో వైద్య విద్యార్థులు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. తిరుమల శ్రీవారి పాదాల చెంత శ్రీ బాలాజీ మెడికల్ కాలేజీ, ఆస్పత్రి అండ్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ ప్రారంభోత్సవం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 2022-23 విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ విద్యార్థులకు శుభాభినందనాలని తెలిపారు. గురువారం ఉదయం రేణిగుంట విమానాశ్రయం వద్ద శిలాఫలకాన్ని ప్రారంభించి, అక్కడే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జ్యోతిని వెలిగించి పాల్గొని ప్రసంగించారు. సమాజంలో మధ్యతరగతి, పేద ప్రజలకు ఆరోగ్యం, విద్యను అందించే దృష్టితో ప్రతిష్టాత్మక సంస్థలైన శ్రీ కంచి కామకోటి ట్రస్టు, సాయిరాం ఫౌండేషన్, ఒరిస్సాలో ఇప్పటికే సేవలందిస్తున్న విజాఒన భారతి ఛారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను అందించడానికి ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి కలిసి వచ్చినందుకు అభినందనలు తెలిపారు. ఈ ఏడాది 150 మంది విద్యార్థులు నేటినుంచి వైద్య విద్య అందించే కార్యకలాపాలను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. 350 పడకల ఆస్పత్రితో పాటు, 62 ఐసియు పడకలు, 32 అత్యవసర పడకల సౌకర్యంతో ఐదు ప్రపంచ స్థాయి ఆపరేషన్ థియేటర్లు, 24 గంటలూ అధునాతన ట్రామాకేర్ సదుపాయాలతో సెంట్రల్ ల్యాబ్, రేడియాలజీ సౌకర్యాలతో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు వారి ఆర్థిక నేపథ్యంతో సంబంధం లేకుండా అధునాతన సదుపాయాలకు ప్రాధాన్యత కల్పిస్తారన్నారు. ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి మాట్లాడుతూ మనుష్యుల్లో మహనీయుడుగా రాష్ట్ర ముఖ్యమంత్రి నవరత్నాలు అమలు చేసి పేదలు ఆర్థికంగా ఎదగాలని, విద్య, ఆరోగ్యం, ఇళ్లు అందించడంతో పాటు రైతులకు పథకాలను అందిస్తున్నారని అన్నారు. క్రీడా శాఖా మంత్రి ఆర్‌కె రోజా మాట్లాడుతూ తాను డాక్టర్ కావాలని తిరుపతి పద్మావతి కళాశాలలో బైపిసి తీసుకున్నానని, కానీ యాక్టర్ అయ్యి, పొలిటీషియన్‌గా మారానని అన్నారు. ఊపిరి పోసిన దేవునికి, ఊపిరి నిలిపే వైద్యునికి మాత్రమే దండం పెడతామన్నారు. ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు సేవలందించాలనే ఉద్దేశ్యంతో 2005లో ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేసిన ఆస్పత్రికి, కొడుకు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. ఇప్పటికే ఐఐటి, ఐజర్ వంటి విద్యాసంస్థల వల్ల ఎడ్యుకేషన్ హబ్‌గా మారడం సంతోషదాయకమన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ తిరుపతి ప్రాణిగ్రహి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రజిని, కలెక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్ర గవర్నర్

తిరుమల శ్రీవారిని గురువారం సాయంత్రం రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న గవర్నర్‌కు టిటిడి ఈవో ఎవి.ధర్మారెడ్డి స్వాగతం పలకగా, ఆలయ అర్చకులు ఇస్తి కఫల్ స్వాగతం పలికారు. అనంతరం ఆయన శ్రీవారిని దర్శించుకుని, వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు, దర్శనానంతరం మొక్కులు చెల్లించుకున్నారు. ఆ తరువాత రంగనాయకుల మండపంలో గవర్నర్‌కు వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఈవో శ్రీవారి తీర్థప్రసాదాలు, శ్రీవారి చిత్రపటాన్ని, డైరీ, క్యాలెండర్ అందించారు.ఈ కార్యక్రమంలో సివిఎస్వో నరసింహకిషోర్, డెప్యూటీ ఈవోలు రమేష్‌బాబు, హరేంద్రనాథ్ పాల్గొన్నారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం

రేణిగుంట వద్ద గల శ్రీ బాలాజీ వైద్య కళాశాల రీసెర్చ్ సెంటర్ మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ ప్రారంభ కార్యక్రమం, ఎస్వీ వైద్య కళాశాల వద్ద పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన లైబ్రరీ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకునే నేపథ్యంలో రేణిగుంట విమానాశ్రయానికి ఉదయం 11.20 కు చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్‌కి ఘన స్వాగతం లభించింది. వీరివెంట . గవర్నర్ స్పెషల్ సి ఎస్ ఆర్ పి సిసోడియా ఉన్నారు.జిల్లా కలెక్టర్ కే వెంకట రమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, ఈ ఎం సి క్లస్టర్ సీఈఓ గౌతమి తదితరులు ఘన స్వాగతం పలికారు.

డిజిటల్ లైబ్రరీకి శంకుస్థాపన

పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం అనేది భగవంతుడికి చేసే సేవలతో సమానమని రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్ అన్నారు. గురువారం మధ్యాహ్నం స్థానిక ఎస్.వి.మెడికల్ అల్యూమిని అసోసియేషన్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీ శంకుస్థాపన, డా. సుబ్రమణ్యం, సునీత, శ్రీధర్ రాజు, సుభాషిణి వారి ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ఆడిటోరియంను గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్ ప్రారంభించారు. తన ప్రసంగం ముగిస్తూ కార్ల్ జంగ్ మాటలు గుర్తు చేస్తూ మందులు రోగాన్ని నయం చేస్తాయి కానీ, డాక్టర్లు మాత్రమే రోగులకు చికిత్స చేసి నయం చేయగలరు అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు సభ్యులు మద్దిల గురుమూర్తి, గవర్నర్ స్పెషల్ సి ఎస్ ఆర్పీ సిసోడియా, కలెక్టర్ కె. వెంకట రమణ రెడ్డి, తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకర రెడ్డి, ఎస్.వి. మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు, డా. ఆర్.రమేష్ బాబు పాల్గొన్నారు.

శ్రీసిటీ నిరుద్యోగుల పాలిట 'సిరి'సిటి : కొమ్మినేని

ప్రజాశక్తి - వరదయ్యపాళెం

'శ్రీసిటీ అభివద్ధి అత్యద్భుతమని, ఇలాంటిది మరో ఐదారు వస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తిరుగుండదని ఏపీ ప్రెస్ అకాడెమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ ఆయనకు సాదర స్వాగతం పలికి, పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. ఈ సందర్భంగా కొమ్మినేని స్థానిక మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేకించి వేలాది మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్న

శ్రీసిటీ, ఈ ప్రాంతానికి 'సిరి' సిటీ అంటూ ప్రశంసించారు. ఈ పర్యటన తనకు మంచి అనుభూతిని కలిగించిందన్నారు. పరిశ్రమలతో పాటు సరికొత్త సమాజాన్ని స్థాపించారంటూ శ్రీసిటీ నిర్వాహకులను అభినందించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి దార్శినికత, గొప్పదనానికి శ్రీసిటీ సాక్ష్యంగా నిలుస్తుందని కొమ్మినేని పేర్కొన్నారు. తండ్రి బాటలోనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాభివద్ధికి, పరిశ్రమల ఏర్పాటుకు విశేష కషి చేస్తున్నారని తెలిపారు. కొప్పర్తి, కష్ణపట్నం, అచ్యుతాపురం పారిశ్రామికవాడలను కొత్తగా ఏర్పాటు చేశారన్నారు. ఉద్యోగులతో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకున్నారు.

మహిళా ఓటర్లే అధికం

ప్రతేక తుది జాబితా విడుదల / జిల్లాలో ఓటర్లు 17,27,576

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

'ప్రత్యేక తుది ఓటర్ల జాబితా - 2023'ని కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి విడుదల చేశారు. జిల్లాలోని అన్ని తహసిల్దార్ కార్యాలయాల్లో, పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా ప్రదర్శించాలని , ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతేక ఓటర్ల సవరణ జాబితా -2023 తయారీలో తమవంతు కషి చేసినందుకు అధికారులను అభినందించారు. జాబితాలో మహిళా ఓటర్లే ప్రతి నియోజకవర్గంలోనూ అధికంగా ఉండటం గమనార్హం.

మొత్తం ఓటర్లు : 17,27,576

గూడూరు : పురుషులు 1,17,583, మహిళలు 1,21,522, ట్రాన్స్ జెండర్స్ 47 మంది.

సూళ్ళూరు పేట : పురుషులు 1,13,304, మహిళలు 1,18,432 ,ట్రాన్స్ జెండర్స్ 45 మంది.

వెంకటగిరి : పురుషులు 1,13,510, మహిళలు 1,18,581,ట్రాన్స్ జెండర్స్ 02 మంది.

చంద్రగిరి : పురుషులు 1,41,302, మహిళలు 1,47,513 ట్రాన్స్ జెండర్స్ 64 మంది.

తిరుపతి : పురుషులు 1,43,785, మహిళలు 1,44,290 ట్రాన్స్ జెండర్స్ 48 మంది.

శ్రీకాళహస్తి : పురుషులు 1,17,039, మహిళలు 1,23,719, ట్రాన్స్ జెండర్స్ 20 మంది.

సత్యవేడు : పురుషులు 1,00,820, మహిళలు 1,05,935, ట్రాన్స్ జెండర్స్ 15 మంది.

మొత్తం : పురుషులు 8,47,343, మహిళలు 8,79,992, ట్రాన్స్ జెండర్స్ 241మంది.

'మెస్ ఛార్జీలు' పెంచాలి

ఎస్ఎఫ్ఐ భిక్షాటన

ప్రజాశక్తి - క్యాంపస్

రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ వసతి గహాల విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తిరుపతి పట్టణంలోని బాలాజీ కాలనీ సర్కిల్ నందు ఎస్ఎఫ్ఐ నాయకులు భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి యన్. మాధవ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల స్థాయి వసతిగహాల విద్యార్థులకు 1200, కళాశాల స్థాయి వసతిగహాల విద్యార్థులకు 1400 మెస్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోందని, అయితే 2108 ధరలకు ప్రస్తుత ధరలకు చాలా వ్యత్యాసం ఉండటం వలన మెస్ చార్జీలు ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. జైలు లోని ఖైదీ ల కంటే తక్కువ మెస్ చార్జీలు రాష్ట్రంలోని విద్యార్థులకి ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలులో భాగంగా వసతి గహాలలో ఉండే విద్యార్థులకు మెస్ చార్జీలు కింద కళాశాల విద్యార్థులకు 20వేల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుతం 1400 చొప్పున 8 నుండి 10 నెలలు మాత్రమే మెస్ చార్జీలు విడుదల చేస్తున్నారని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత మూడు నెలలుగా సంక్షేమ వసతి గహాల పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా మెస్ చార్జీలు పెండింగ్ లో ఉండటం వలన హాస్టల్ నిర్వాహకులకు భారంగా మారుతోందన్నారు. ఫలితంగా మెనూ అమలు జరగడం లేదని వాపోయారు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెండింగ్ మెస్ చార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు భగత్ రవి, ఉపాధ్యక్షులు ఉరుకుందు, సహాయ కార్యదర్శి హరిత నాయకులు పథ్వి, శివ, ప్రశాంత్, అంజి, అన్నమయ్య, వేమన, వెంకటేష్, హంపయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తూ...

మహిళా వర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా ఎన్.రజిని

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్ గా ఆచార్య ఎన్. రజిని ఉపకులపతి చాంబర్లో ఆచార్య దువ్వూరు జమున చేతుల మీదుగా గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఆరు సంవత్సరాలకు పైగా రిజిస్ట్రర్ గా పనిచేసిన ఆచార్య డి.ఎం. మమత పదవీకాలం ముగియడంతో నాక్ పర్యటన దష్ట్యా వారం రోజులు పొడిగించారు. పొడిగింపు కాలం ముగియడంతో మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ పదవి ఖాళీ ఏర్పడింది. దీంతో వర్సిటీలోని హోం సైన్స్ విభాగానికి చెందిన సీనియర్ ఆచార్యులు ఆచార్య ఎన్.రజినిని మంగళవారం జరిగిన పాలకమండలి సమావేశంలో నూతన రిజిస్ట్రార్ గా నిర్ణయించారు. ఈ మేరకు వర్సిటీ పరిపాలన భవనం నుంచి ఉత్తర్వులు అందాయి. ఎన్. నరసింహారెడ్డి, ఎన్. శాంత కుమారిల కూతురు ఎన్. రజిని. ఎంఎస్సీ హోం సైన్స్ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పూర్తి చేశారు. పీహెచ్డీ డిగ్రీ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పూర్తి చేశారు. ఇక్కడే హోం సైన్స్ విభాగంలో అధ్యాపకులుగా చేరి విభాగాధిపతిగా, బివో ఎస్ చైర్పర్సన్ గా, వివిధ పదవులను అలంకరించి మంచి పరిపాలన దక్షురాలుగా పేరు గడించారు. ఈ సందర్భంగా వర్సిటీలోని అధ్యాపకులు, అధ్యాపకుల సంఘం అధ్యక్ష,కార్యదర్శులు ఆచార్య విజయలక్ష్మి, ఆచార్య త్రిపుర సుందరి, దుర్గ భవాని, నీలిమ, శోభారాణి, ఆధ్యాపకులు ఆచార్య కాత్యాయని, డాక్టర్ శ్రీరజిని, ఆచార్య సారా సరోజిని, ఆచార్య భారతి, బోధనేతర సిబ్బంది, ఉద్యోగులు, టీబీఐ ఇంక్యుబేషన్ సెంటర్ సిబ్బంది, ఇంజనీరింగ్ కళాశాల సిబ్బంది, మేనేజ్మెంట్ కళాశాల సిబ్బంది పుష్పగుచ్ఛం, దుశ్శాలువలతో ఆమెకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజిని మాట్లాడుతూ బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థినిల సహకారంతో వర్సిటీని మరింత అభివద్ధి పథంలో తీసుకెళ్లేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఇప్పటికే వర్సిటీ 'ఏ ప్లస్' సాధించిందని, అలాగే ప్రస్తుతం వర్సిటీలో 36వ దక్షిణాది రాష్ట్రాల అంతర్ విశ్వవిద్యాలయాల యువజన ఉత్సవాలను సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. వర్సిటీలో ఏవైనా సమస్యలు తన దష్టికి వస్తే పరిష్కరించేందుకు కషి చేస్తానన్నారు.

వాంటెడ్ స్మగ్లింగ్ బ్రదర్స్ అరెస్ట్

పోలీసు యూనిఫాంలో స్మగ్లింగ్ చేస్తూ...

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

వివిధ జిల్లాల్లో దాదాపు 89కేసులు ఉన్న వాంటెండ్ స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్సు ఎస్పీ కే.చక్రవర్తి తెలిపారు. వీరి నుంచి 31ఎర్రచందనం దుంగలు, ఆరు సెల్ ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ వీరిద్దరూ కడప జల్లా చాపాడు మండలానికి చెందిన షేక్ చెంపతిలాల్ బాషా (36), షేక్ చంపతి జాకీయర్ (27)లుగా గుర్తించినట్లు తెలిపారు. వీరిద్దరూ సోదరులని, వీరు గత కొన్ని సంవత్సరాలుగా ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారని తెలిపారు. వీరి కోసం కొంతకాలంగా చేపట్టిన వ్యూహం ప్రకారం అరెస్టు చేసినట్లు తెలిపారు. డీఐజీ సెంథిల్

కుమార్ ఆదేశాల మేరకు ఎస్పీ చక్రవర్తి అద్వర్యంలో సీఐ రామకష్ణ, ఆర్ఎస్ఐ చిరంజీవులు టీమ్ ఏర్పేడు సమీపంలోని కష్ణాపురం, మల్లెమడుగు, కరకంబాడి ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టారు. కరకంబాడి ఫారెస్ట్ బీట్ అమర్ రాజా ఫాక్టరీ విన్జియో కంపెనీ వద్ద కారుతో నిలబడి ఉండటాన్ని గమనించారు. వీరిని సమీపించడంతో పారిపోవడానికి ప్రయత్నించారు. ఆర్ఎస్ఐ రాఘవేంద్ర మరికొంత మంది పోలీసులు చుట్టుముట్టి పట్టుకో గలిగారు. వీరిని అంతర్రాష్ట్ర స్మగ్లర్లుగా గుర్తించారు. వీరి నుంచి 31ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం చేసుకున్నారు. కారులో పోలీసు యూనిఫాంను కూడా కనుగొన్నారు. వీరు పోలీసు యూనిఫాం వేసుకుని స్మగ్లింగ్ కు పాల్పడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను హైజాక్ చేసి, ఇతర రాష్ట్రాలకు అమ్మేవారని తెలిపారు. 31ఎర్రచందనం దుంగలు విలువ రూ. 20లక్షలు ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఆర్ఎస్ఐ సురేష్ కుమార్ రెడ్డి, సీఐలు చంద్రశేఖర్, బాలకష్ణ, రామకష్ణ, ఎఫ్ఆర్వోలు, ఎస్ఐ పాల్గొన్నారు. ఆపరేషన్ లో పాల్గొన్న వారికి ఎస్పీ రివార్డులు ప్రకటించారు.

పార్టీ వ్యతిరేకులు ఎవరైనా క్రమశిక్షణా చర్యలు తప్పవు

మీడియాతో బాలినేని శ్రీనివాసురెడ్డి

ప్రజాశక్తి - తిరుచానూరు

పార్టీ వ్యతిరేకులు ఎవరైనా క్రమశిక్షణా చర్యలు తప్పవని వైఎస్ఆర్ కాంగ్రెస్ రీజినల్ ఇన్‌ఛార్జి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తిరుచానూరు తాజ్ హోటల్లో జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి ఆర్‌కె రోజాతో పాటు జిల్లాలోని పలు నియోజకవర్గాల ఎంఎల్ఎలు హాజరయ్యారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం విలేకరులతో బాలినేని శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంకటగిరి సమన్వయకర్తగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని నియమించడంపై వివరణ ఇచ్చారు. ఆనం రాంనారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించాలని పిలుపునిచ్చారు. నాయకులంతా కలసికట్టుగా పనిచేసి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని స్థానాలూ గెలవాలన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా ఎంఎల్ఎల గ్రాఫ్ పెరిగిందన్నారు. జిల్లాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదన్నారు. చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించారు. పార్టీకి వ్యతిరేకరంగా ఎవరు మాట్లాడినా క్షమించేది లేదన్నారు. అందుకే వెంకటగిరి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నియామకం జరిగిందన్నారు. బాలకృష్ణ సినిమా ఫంక్షన్‌కు పున్ణపరిశీలన చేసి అనుమతి ఇచ్చారని, దీన్ని రాజకీయం చేయడం టిడిపికి తగదన్నారు. మంత్రి ఆర్‌కె రోజా మాట్లాడుతూ చంద్రబాబు ఒక వీధి రౌడీలా ప్రవర్తిస్తున్నారన్నారు. దేశంలోనే పొలిటికల్ సైకో చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ వెన్నుపోటు నుంచి ప్రజల ప్రాణాలు తీసేవరకూ సైకో చంద్రబాబు ముఖ్య భూమిక పోషించారన్నారు. 1861 పోలీసు చట్టం ప్రకారం దేశంలో అన్ని రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలు అమలు చేస్తున్నారన్నారు. కుప్పంలో చంద్రబాబకు కూసాలు కదులుతున్నాయన్నారు. కుప్పంలో గల్లీగల్లీ తిరిగినా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈడ్చి తంతే హైదరాబాద్‌లో పడ్డారన్నారు.

భూకబ్జాదారు నుండి చెరువును కాపాడాలి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుచానూరు

తిరుపతి రూరల్ తిరుచానూరు పంచాయతీలో ఉండే యోగి మల్లవరం దగ్గర ఎగువ మల్లవరం చెరువును ఆక్రమించుకొని ఇల్లు నిర్మిస్తున్న భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తిరుపతి రూరల్ తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. సిపిఎం జిల్లా నాయకులు జయచంద్ర, తిరుచానూరు సిపిఎం పంచాయతీ కార్యదర్శి కె.సుమన్ మాట్లాడుతూ యోగిమల్లవరం దగ్గర ఉన్న ప్రభుత్వ భూమి, చెరువులు సర్వేనెంబర్ 1/1,1/2 లో ఉన్న ప్రభుత్వ చెరువు భూమిని 12 ఎకరాల 40 సెంట్లు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికీ కోర్టులో కేసు ఉన్నప్పటికీ దానిని ఏమాత్రం లెక్క చేయకుండా ఇళ్లు నిర్మిస్తూ అమ్ముకుంటున్నారని, గతంలో అనేకసార్లు ప్రభుత్వ అధికారుల దష్టికి తీసుకుపోయినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. ఉన్న భూములైనా కబ్జా కాకుండా

కాపాడాలంటే ఆ సర్వే నెంబర్లు విచారణ చేసి కంచె వేయాలని, ఆ భూమిలో బోర్డులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఆక్రమించుకున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున కలెక్టరేట్ ముట్టడి చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు పి.సాయి లక్ష్మి, ఎం నరేంద్ర, నీలకంఠం, శేఖర్, శేషాద్రి, సూర్య, జానకిరామ్, అంకయ్య, ధుష్యంత్ , ఉమాపతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షితమైన నీటితోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని ముచ్చివోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రగతి సంస్థ(తిరుపతి) ఆధ్వర్యంలో సురక్షితమైన నీరు తాగడంతో కలిగే లాభాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి నీటి పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అసిస్టెంట్ కుమారి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సురక్షితమైన నీరుతాగటంతో అనారోగ్యం బారిన పడకుండా ఉంటారన్నారు. ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ ప్రభాకర్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో జల జీవన్ మిషన్ కార్యక్రమాన్ని ప్రభుత్వ సహకారంతో తమ సంస్థ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికీ మంచినీటి కొళాయిలు ఉండేలా సర్వే నిర్వహిస్తున్నామన్నారు. అలాగే గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే ఆ పంచాయతీ సర్పంచ్ దష్టికి.. సంబంధిత అధికారులకు తెలియజేసి నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపి, ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ రామచంద్రయ్య, సీఆర్పీ ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వం మెరుగైన సేవలు

ప్రజాశక్తి-నాయుడుపేట: ఆర్బీకేలతో రైతులకు అందిస్తున్న సేవలు ఎంతో మెరుగ్గా ఉన్నాయని తమిళనాడు సీఎంవో కార్యాలయ అధికారి భరద్వాజ్ అన్నారు. నాయుడుపేట మండలం కలిపేడు గ్రామంలో ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయనతో కూడిన బృందం పరిశీలించింది. ఆర్బీకేల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను తెలుసుకోవడంతో పాటు గ్రామంలోని రైతులతో చర్చించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు గణేష్, కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో ఉచిత సైనిక్ మోడల్ ఎంట్రన్స్ టెస్ట్

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం విద్యా సంస్థలలో ఈ నెల 6వ తారీఖున శుక్రవారం ఉదయం 9:00 గంటలకు ఉచిత సైనిక్ మోడల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు విశ్వం విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్. విశ్వనాథ రెడ్డి తెలియజేశారు. 6 - 9వ తరగతి ప్రవేశానికి జాతీయ స్థాయిలో జనవరి 8వ తేదీన నిర్వహించు ప్రవేశ పరీక్షకు అనుగుణంగా ఈ నమూనా పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ నమూనా పరీక్ష ద్వారా విద్యార్థులు ప్రధాన పరీక్షకు సంసిద్ధం కావడంతో పాటు సబ్జెక్ట్ పరంగా లోపాలను సరిదద్దుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ నమూనా పరీక్షకు ఎలాంటి ప్రవేశ రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు, నమూనా పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్ (అడ్మిట్ కార్డ్) జిరాక్స్ కాపీని వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9399976999, 8688888802 / 03 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చన్నారు.

స్పెషలిస్ట్ వైద్యులను నియమించండి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గానికి స్పెషలిస్ట్ వైద్యులను నియమించాలని రాష్ట్ర వైద్య శాఖ మంత్రి విడదల రజనిని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. గురువారం ఉదయం తిరుపతికి విచ్చేసిన మంత్రిని ఎమ్మెల్యే కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ ప్రధానంగా సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో గైనకాలజిస్ట్, రేడియోగ్రాఫర్ తప్పనిసరిగా నియమించాలని కోరారు. గైనకాలజిస్ట్ లేకపోవడం వల్ల పేద ప్రజలు ప్రసవ సమయాల్లో 100 కిలోమీటర్లు పైగా ఉన్న తిరుపతి వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. దీనివల్ల కొన్నిసార్లు ప్రాణాల మీదకు వస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయన వివరించారు. అలాగే రేడియోగ్రాఫర్ నిపుణుల కొరతతో పాటు నియోజకవర్గం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది కొరత వంటి సమస్యలను ఎమ్మెల్యే ఆదిమూలం మంత్రి దష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

ప్లాట్లకు దారి లేదని హెచ్చరిక బోర్డు

ప్రజాశక్తి-రేణిగుంట: రేణిగుంట మండలంలోని గుత్తివారిపల్లి గ్రామానికి చెందిన స్మశాన దారిని తిరుపతికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి యశ్వంత్‌బాబు కబ్జా చేసి సీసీ రోడ్డు ఏర్పాటు చేసే ప్రయత్నం చేయడంతో గుత్తివారిపల్లి గ్రామస్థులు అడ్డుకోవడంతో పాటు ప్లాట్లకు దారి లేదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారికి వ్యతిరేకంగా నిరసన తెలిపామని సీపీఎం రేణిగుంట రూరల్ కార్యదర్శి ఎం. చీరాలయ్య తెలిపారు. శ్మశానానికి దారి ఇవ్వకుంటే కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.

పేదలకు ఉచిత వైద్యం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : పేదలకు ఉచిత వైద్యం భగవంతుడికి చేసే సేవతో సమానమని పుత్తూరు మున్సిపల్ కమిషనర్. కేఎల్ఎన్ రెడ్డి అన్నారు. విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆ సంఘం అధ్యక్షులు భాస్కర్ రాజు అధ్యక్షతన గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. గుడ్‌షెపర్డ్ ఆసుపత్రి , విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. 300 మందికి ఉచిత వైద్యసేవలు అందించారు. నిర్వాహకులు ఎం హెన్రీ భాస్కర్, ప్రవీణ్ సహకారంతో మందులు పంపిణీ చేశారు. మాజీ మండలాధ్యక్షులు ఏలుమలై భోజనం అందించారు. కార్యక్రమంలో గుణశేఖర్‌రెడ్డి, యుగంధర్‌రాజు, కుప్పయ్య, రామలింగం, రామచంద్రరాజు, మేకల సుబ్రమణ్యం, నారాయణ రెడ్డి, దొరైవేలు, క్రుపావరమ్మ, నిర్మలా జయకుమారి, చంద్ర శేఖర్ వర్మ, గుణశేఖర్ వర్మ, వెంకటకష్ణమనాయుడు పాల్గొన్నారు.

'చీకటి' జీవోను రద్దు చేయండి : టిడిపి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్/ శ్రీకాళహస్తి

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తీసుకొచ్చిన జీవో నెంబర్ వన్ వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ గురువారం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి ఎం సుగుణమ్మ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా టిడిపి మాజీ ఎమ్మెల్యే ఎం సుగుణమ్మ, తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సభలు, సమావేశాలు, రోడ్ షోలు చేయకూడదని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం కన్నా జగన్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. జీవో కాపీలు రద్దు చేసే వరకూ పోరాటాన్ని ఉదతం చేస్తామని హెచ్చరించారు. తర్వాత జీవో నెంబర్ వన్ కాపీలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు చినబాబు, టిడిపి కార్పొరేటర్ ఆర్సి మునికష్ణ, నాయకులు మునిశేఖర్, వూక విజయ్ కుమార్, పుష్పావతి, కష్ణ యాదవ్ పాల్గొన్నారు. చీకటి జీవోను వెంటనే రద్దు చేయాలని టీడీపీ పట్టణాధ్యక్షుడు గెడిపూడి విజయకుమార్ నాయుడు డిమాండ్ చేశారు. గురువారం అంబేద్కర్ సర్కిల్ వద్ద టీడీపీ నేతలు అర్ధ నగ్న ప్రదర్శన చేశారు. గుమ్మడిపూడి దశరధాచారి, కాసరం రమేష్, కిషోర్, కంఠా రమేష్, మిన్నల్ రవి, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

యర్రావారిపాలెం: కుప్పంలో చంద్రబాబునాయుడు పర్యటనకు ప్రభుత్వం ఆంక్షలు పెట్టినందుకు నిరసనగా టీడీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి గురువారం నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి చట్టాలను తీసుకొచ్చి ప్రజాస్వామ్య దేశంలో సభలు.. సమావేశాలు నిర్వహించడానికి ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రఘునాథ, ప్రధాన కార్యదర్శి మహేష్, పార్లమెంట్ కార్యదర్శి అన్నాసముద్రం మధు, వేణుగోపాల్ నాయుడు, సిద్ధకుమార్, చిన్నపరెడ్డి, వెంకటరత్నం, బాలకేశవనాయుడు,

జైపాల్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, వెంకట శివరామిరెడ్డి, కుంభ నాగరాజు, హరిచంద్ర, మురళీ, పల్లెపాకు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: నాయుడుపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జీవో నంబరు ఒకటిని రద్దు చేయాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో జీవో కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నేత చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జీవో నెంబర్ ఒకటి పేరుతో కుట్ర పూరితంగా జీవోను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం తన వ్యతిరేకతను తగ్గించుకోవడానికి ఇలాంటి దుర్మార్గమైన జీవోలు జారీ చేయడం అనాగరిక చర్యని అన్నారు. సీపీఎం నేత శివకవిముకుంద మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీల గొంతు నొక్కడానికే ఇలాంటి జీవోలు జారీచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రజక సంఘం నేత పుట్టయ్య, జె వి కె ఎస్ జిల్లా అధ్యక్షులు గోపాల్, నాయుడుపేట ఐద్వా నాయకురాలు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు జగనన్న సాయం : మోహిత్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుచానూరు: అవ్వాతాతలకు పింఛన్ కానుక జగనన్న సాయమని ఎంపిపి మోహత్‌రెడ్డి అన్నారు. తిరుచానూరు జడ్‌పి హైస్కూల్లో పెంచి ఇస్తున్న పెన్షన్ కానుకను ప్రారంభించారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి సుదీర్ఘ సంకల్ప పాదయాత్రలో ప్రజల కష్టసుఖాలను గుర్తించారన్నారు. ఇందలో భాగంగానే వేయి రూపాయలు ఉన్న పెన్షన్ ను మూడున్నర సంవత్సరాలుగా ఏటా పెంచుతూ 2,750 కి తీసుకొచ్చారన్నారు. గత ప్రభుత్వం లో చాలీ చాలని పెన్షన్ లతో బాధపడుతున్న అవ్వాతాతలకు సాయం అందించారన్నారు. తెల్లంగాణ మినహ తక్కిన ఏ రాష్ట్రంలోనూ ఇంత పెన్షన్ అందిస్తున్న ఘనత మన రాష్ట్రానికి, మన ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి ఎంపీపీ యశోద, ఎంపీటీసీలు నరేష్ రెడ్డి, గ్యాస్ శేఖర్, శివశంకర్ వార్డ్ మెంబర్లు మునీంద్ర రాయల్ డిష్ చంద్ర పాల్గొన్నారు.

'గడప గడపకూ మన ప్రభుత్వం' పనులపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన పనులపై ప్రత్యేక దష్టి పెట్టి పూర్తి చేసేలా చూడాలని సి.ఎస్. జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను, జాయింట్ కలెక్టర్ లను ఆదేశించారు. గురువారం ఉదయం అమరావతి నుండి సంబంధిత కార్యదర్శులతో కలిసి అన్నిజిల్లాల కలెక్టర్లతో, జాయింట్ కలెక్టర్ లతో వర్చువల్ విధానంలో రీ సర్వే, ల్యాండ్ అక్విజేషన్, హౌసింగ్, వ్యవసాయం, స్పందన, గడపగడపకు మన ప్రభుత్వం అంశాలపై సమీక్ష నిర్వహించగా కలెక్టరేట్ నుండి జిల్లా జాయింట్‌కలెక్టర్ డి.కే బాలాజీ సంబంధిత అధికారులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. జిల్లాలో ఈ పంట నమోదు ప్రక్రియను జనవరి 20 తేదీలోగా పూర్తి చేసేలా చూడాలని తెలిపారు. పి ఎం కిసాన్ సంబంధించి ఈకే వై సి ప్రక్రియను జనవరి 15 వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. రాష్ట ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన నవరత్నాలు పేదలందరికి ఇళ్ళ పథకంలో భాగంగా ఈ ఉగాదికి 5 లక్షల ఇళ్ళ నిర్మాణాల పూర్తి అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టి పూర్తిచేసేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ. శ్రీనివాస రావు, డి ఎల్ డి ఓ సుశీల దేవి, డ్వామా పి డి శ్రీనివాస ప్రసాద్, జిల్లా ప్లానింగ్, స్టాటిస్టికల్ అధికారి అశోక్ కుమార్, హార్టికల్చర్ డి డి దశరథ రామిరెడ్డి , ఎడి సర్వేయర్ జయరాజ్, డి పి ఓ రాజశేఖర్ రెడ్డి , జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా యువజనోత్సవ ప్రదర్శనలు

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో జరుగుతున్న యువజనోత్సవాలలో భాగంగా విద్యార్థినీ విద్యార్థినులు మూడవరోజు కళాప్రదర్శనలు ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేశాయి. ప్రేక్షకులు, అభిమానులు, విద్యార్థులు మంత్రముగ్ధులయ్యారు. చదువుతోపాటు ఆటపాటలకు 'సై'అంటూ పోటాపోటీగా ప్రదర్శనలు ఇచ్చారు. వివిధ యూనివర్సిటీల విద్యార్థినీ విద్యార్థినులు రాజ్యాంగాన్ని కాపాడాలంటూ, లింగ సమానత్వం, మహిళల రక్షణ వంటి అంశాలతో స్క్రిప్టును అద్భుతంగా ప్రదర్శించారు. గ్రూప్ సాంగ్స్ ను ఆలపించారు. లైట్ వోకల్ సోలో ప్రదర్శనలలో 11 టీమ్స్ పాల్గొన్నాయి. భారతమాతతో పాటు మేమేమీ తక్కువ కాదంటూ పాశ్చాత్య సంగీతాన్ని ఆలపించారు. అంతేకాకుండా పాశ్చాత్య వాయిద్యాలతో ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విసి ఆచార్య దువ్వూరు జమున, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని, కోఆర్డినేటర్స్, పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అర్హులకు పింఛన్లు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: జగనన్న ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారికి పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. పుత్తూరు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గురువారం వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ పెన్షన్లను మంజూరు చేస్తున్నామని.తెలిపారు. ప్రజల కష్టాలను వారి ఇంటి వద్దనే పరిష్కరించాలన్న గొప్ప ఆలోచనతో సచివాలయ వ్యవస్థను తీసుకురావడమే కాకుండా ప్రతి 50 ఇళ్లకు వాలంటీర్స్‌ను పెట్టారని తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ జ్యోతి, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధమ్మ, పుత్తూరు ఎంపీపీ మునివేలు, మునిసిపల్ ఛైర్మన్ హరి, వైస్ ఛైర్మన్లు జయప్రకాష్, శంకర్, ఎంపీడీవో ఇందిరమ్మ, వైస్ ఎంపీపీలు మునస్వామిరెడ్డి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, మున్సిపల్ కమీషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, తహసీల్దార్ రవికుమార్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుడా పార్కులో ఐమాక్స్ లైట్లు ప్రారంభం

పట్టణంలోని స్థానిక తుడా పార్కులో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా గురువారం రూ.8 లక్షలతో 16 ఐమాక్స్ లైట్లను ప్రారంభించారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపుకు కృషి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా పరిధిలో ప్రభుత్వ పాఠశాలల స్థాయికి తగ్గట్టు విద్యా ప్రమాణాల సాధనకు ఉపాధ్యాయులు నూతన సంవత్సరంలో పునరంకితం కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి. శేఖర్ కోరారు. గురువారం తన కార్యాలయంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడుల బలోపేతం కోసం నాడు-నేడు, జగనన్న విద్యా కానుక, గోరుముద్ద వంటి పథకాలతో పాటు సాంకేతిక విద్యను విద్యార్థులు అందిపుచ్చుకోవడానికి విలువైన ట్యాబ్ లను అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు అధ్యక్షులు టి.శ్రీనివాసులు, మునికష్ణమనాయుడు, నాగేశ్వరరావు, ధనుంజయ నాయుడు, చెంచురత్నం, మురళి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎన్వీఎస్ బాబుకు కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్వీఎస్ బాబు గురువారం ఆకస్మికంగా గుండెపోటుతో మతి చెందారు. ఈ సందర్భంగా ఆయన మృతదేహానికి ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. నాయకుడిగా విధి నిర్వహణలో తోటి ఉద్యోగ సిబ్బందితో ఎనలేని అనుబంధం ఏర్పరచుకున్న బాబు ఆకస్మిక మతి తీవ్ర విషాదాన్ని నింపిందని అంజూరు అన్నారు. ఆచారి, రోశయ్య, ఉదయ్ కుమార్, ఒవీ రత్నం, బాబు, పట్టాభి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలకు స్పందన

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: వరదయ్యపాళెంలోని ఇందిరానగర్‌లో సర్పంచ్ సల్లా వీరభద్రయ్య అధ్యక్షతన గురువారం గ్రామ సభలు నిర్వహించారు. కార్యదర్శులు బాసిరెడ్డి, తిరుమల పంచాయతీలకు వచ్చిన ఆదాయం, వ్యయం నివేదికలను వివరించారు. అనంతరం ఓటీఎస్ లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. జడ్పీటీసీ వెంకటేశ్వర్లు, వైసీపీ మండల కన్వీనర్ నాయుడు, దయాకర్ రెడ్డి, ఎంపీపీ పద్మ ప్రియ, దామోదర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బొప్పన తిలక్, కో ఆప్షన్ సభ్యులు సిద్దిక్, సర్పంచ్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కుప్పుస్వామి

ప్రజాశక్తి-తిరుచానూరు: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కుప్పుస్వామి గురువారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు.

నిండలి సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి-బాలాయపల్లి : నిండలి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో వినీల్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయానికి సమస్యలతో వచ్చేవారితో ప్రేమగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. బయోమెట్రిక్ హాజరు తప్పక వేయాలన్నారు. గ్రామ సచివాలయానికి వచ్చే అర్జీదారులు, ప్రజలకు వారికి కావాల్సిన సమాచారాన్ని వెంటనే అందించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేత శివకుమార్‌కు పితృవియోగం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: చిన్నగొట్టిగల్లు మండల టీడీపీ సీనియర్ నాయకుడు శివకుమార్ తండ్రి రంగయ్య(70) బుధవారం రాత్రి మరణించారు. ఆయన పార్థీవ దేహానికి టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పులివార్తి నాని కుమారుడు పులివర్తి వినీల్ మాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర సివిల్ సప్లై మాజీ ఛైర్మన్ సైకం జయచంద్రారెడ్డి, బెల్లంకొండ మురళి, మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే చేయూత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామానికి చెందిన వెంకటయ్య కుటుంబానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి గురువారం ఆర్థిక సాయం అందించారు. వెంకటయ్య గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులని పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో రఘురాం, సుబ్రమణ్యం, వేమాలయ్య, అలంకారయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

1న విద్యార్థులకు పోటీలు

తిరుపతి సిటీ : తిరుపతి నగరం లోని విద్యార్థినీ, విద్యార్థులకు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో అచ్యుతాష్టకం , విష్ణు సహస్రనామ స్తోత్రం కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు డిపి కార్యదర్శి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 1 వతేదీ ఉదయం 9 గంటలకు తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో ఈ పోటీలు జరుగుతాయి. పదేళ్ళ లోపు విద్యార్థినీ, విద్యార్థులకు "అచ్యుతాష్టకం" పై నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు 9676615643 మొబైల్ నంబర్ లో కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చు, పేర్కొన్నారు.

గేటుపుత్తూరు దారి మూసివేయడం దారుణం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : పట్టణంలోని గేటు పుత్తూరుకు వెళ్లే దారిని రైల్వే అధికారులు ఇనుప కంచెలతో మూసివేయడం దారుణమని టిడిపి మాజీ అధికార ప్రతినిధి పోతుగుంట విజయబాబు అన్నారు. పుత్తూరు రైల్వేస్టేషన్‌లో ఈమేరకు స్టేషన్ మాస్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నో సంవత్సరాలుగా గేటు పుత్తూరు వాసులు రాకపోకలు సాగిస్తున్నారని.. అయితే ఎలాంటి సమాచారం లేకుండా దారి మూసివేయడం దారుణమని వాపోయారు. కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి రవినాయుడు, మాజీ ఎంపీటీసీ ధనపాల్, పీఎన్‌టీయూసీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఆరవ ప్రకాష్, నాగరాజు, సురేష్ పాల్గొన్నారు.

లా కళాశాల ట్యూషన్ ఫీజు తగ్గించాలి

క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని బిఏ ఎల్ఎల్బీ ఐదు సంవత్సరాల కోర్సు కళాశాల ట్యూషన్ ఫీజును తగ్గించాలని, అడ్మిషన్స్ పెంచాలని ఏఐఎస్ఎఫ్ నేతలు వర్సిటీ రిజిస్ట్రార్ మహమ్మద్ హుస్సేన్ కి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ సంఘం వర్సిటీ అధ్యక్షులు పి సుందర్ మాట్లాడుతూ గతంలో ఐదు సంవత్సరాలు ఎల్.ఎల్.బి కోర్సు కు 25 వేలు మాత్రమే ఉన్న ఫీజు ను ఇప్పుడు 40 వేలకు పెంచడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. తక్షణమే పెంచిన ఫీజు తగ్గించాలని, గతంలో 66 అడ్మిషన్స్ భర్తీ చేస్తుండగా ఈ సంవత్సరం 44 అడ్మిషన్స్ లకు మాత్రమే పరిమితం చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు తిరుమలేష్, మధు వెంకటేష్ పాల్గొన్నారు.

జీవో 110ను అమలు చేయండి

క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అకడమిక్ కన్సల్టెంట్ అధ్యాపకులుగా పనిచేస్తున్న వారి జీతాలను పెంచే రాష్ట్ర ప్రభుత్వపు జీవో 110 అమలు చేయాలని గురువారం ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేతలు మల్లికార్జున్ రెడ్డి, మనోజ్, ఓబులేసులు మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల్లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 110 జీవోను అమలుపరుస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో అతి పెద్ద విశ్వవిద్యాలయమైన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోనూ ఆ జీవో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో ఎంతోమంది శాశ్వత అధ్యాపకులు ఉద్యోగ విరమణ చేశారని, విద్యార్థులు ఎక్కువమంది ఉన్న విభాగాలలో సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సు పరిధిలో ఉన్నటువంటి తాత్కాలిక అధ్యాపకులను బ్లాక్ లోకి మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో తిరుపాల్ రెడ్డి, సాలేహ, శ్రీధర్, వీరారెడ్డి పాల్గొన్నారు.

వృద్ధుల వార్డు ప్రారంభం

తిరుపతి సిటీ : ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ కుమార్ సూచనల మేరకు తిరుపతిలో ఎస్. వి .ఆర్. ఆర్. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్/ ఎస్ వి వైద్య కళాశాల లో 30 పడకల (20 మంది పురుషులు మరియు 10 మంది స్త్రీలు) వద్దుల వార్డును ఎస్వీఎంసీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ ప్రారంభించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ జనరల్ మెడిసిన్ 2010 నుండి వద్దుల జనాభాకు ప్రత్యేక ఔట్ పేషెంట్ క్లినిక్‌ల రూపంలో సేవలను అందిస్తోంది. రోజుకు 60-80 మంది రోగుల సంఖ్య తో, డిపార్ట్‌మెంట్ ఇంటర్నేషనల్, ఒక సౌత్ జోన్ కాన్ఫరెన్స్ (ఏజింగ్ అండ్ హెల్త్ కాంగ్రెస్) కూడా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ విభాగ అధిపతి డాక్టర్ మునీశ్వర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్, వైస్ ప్రిన్సిపాల్ అడ్మిన్ డాక్టర్ వెంకట్, రుయా హాస్పిటల్ ఇంచార్జ్ సూపరిటెంటెడ్ డాక్టర్ సురేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

బీసీలను ఆదుకున్నది టిడిపినే

తిరుపతి సిటీ : రాష్ట్రంలో బీసీలను తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆదుకుని వారి సంక్షేమానికి, అభ్యున్నతికి కృషి చేస్తే, వైసిపి అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి వారిని నమ్మించి నిట్ట నిలువునా ముంచాడని తిరుపతి పార్లమెంట్ టిడిపి బీసీ సెల్ అధ్యక్షుడు రుద్రకోటి శివం చెప్పారు. గురువారం రేణిగుంట రోడ్డు లోని టిడిపి తిరుపతి పార్లమెంట్ జిల్లా కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ బిసి సెల్ జిల్లా ఆత్మీయ సదస్సు జరిగింది. ముందుగా టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన రుద్రకోటి సదాశివం మాట్లాడుతూ టిడిపి అంటేనే బీసీల పార్టీ అని చెప్పారు. వెనుకబడిన వర్గాలలో రాజకీయ చైతన్యం కల్పించి వారిని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగాఉన్నత స్థానాన్ని కల్పించింది టిడిపి అన్నారు. తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ని ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత నేడు బీసీలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దశరదాచారి, గురవారెడ్డి పాల్గొన్నారు.

నూరు శాతం పన్ను వసూలు చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్లో ఉన్న ఇంటి, కొళాయి, ఖాళీ జాగా ఇతరత్రా పన్ను బకాయిలను నూరు శాతం వసూలు చేయాలని ఇన్చార్జి కమిషనర్ వెంకటరమణ సచివాలయ అడ్మిన్ సెక్రటరీలకు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన సచివాలయ అడ్మిన్ సెక్రటరీలతో సమావేశమయ్యారు. నూరు శాతం పన్ను వసూళ్లపై దిశా నిర్దేశం చేశారు.